# నినాదాలు నిజం చేసిన సతీశ్‌బాబు

- హుస్నాబాద్‌కు గోదావరి నీళ్లు తెచ్చినం..
- రెవెన్యూ డివిజన్, డీఎస్పీ ఆఫీసు, మున్సిపాలిటీ ఏర్పాటు చేసుకున్నాం

- అక్కన్నపేట మండలం ఏర్పాటు చేసుకున్నాం..
- సమైక్య రాష్ట్రంలో హుస్నాబాద్ పచ్చబడ్డది..
- ఎమ్మెల్యే సతీశ్‌బాబును మూడోసారి గెలిపించాలి
- మన మేనిఫెస్టోతో ప్రజల హృదయాలు ఉప్పొంగిపోతున్నాయి
- హుస్నాబాద్ ప్రజా ఆశీర్వాద సభలో ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు


మాట్లాడుతున్న మంత్రి తన్నీరు హరీశ్‌రావు


సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే సతీశ్ కుమార్, తదితరులు

సిద్దిపేట, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): హుస్నాబాద్‌లో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కొన్ని నినాదాలు, గోడల మీద రాతలుగా ఉండేవని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఈ ప్రాంతానికి గోదావరి నీళ్లు, రెవెన్యూ డివిజన్, డీఎస్పీ ఆఫీసు, మున్సిపాలిటీ, అక్కన్నపేట మండలం కావాలని, ఇట్లా ఎన్నో నినాదాలు ఉండేవన్నారు. వాటన్నింటిని సీఎం కేసీఆర్ ఆశీస్సులతో స్థానిక ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ నిజం చేశారన్నారు. ఆదివారం హుస్నాబాద్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద బహిరంగ సభలో మంత్రి మాట్లాడారు. గత శాసనసభ ఎన్నికల్లో హుస్నాబాద్ గడ్డ నుంచి ఎన్నికల ప్రచారాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించి ఘన విజయం సాధించారన్నారు. ఈసారి కూడా ఇక్కడి నుంచే ఎన్నికల ప్రచారాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించారని తెలిపారు. సీఎం కేసీఆర్‌కు హుస్నాబాద్ అంటే ప్రేమ, నమ్మకం, గురి, ఈ మట్టికి అంత మహిమ ఉంది అని, హుస్నాబాద్ ప్రజలకు అంత గొప్పతనం దక్కిందన్నారు. ఎల్లమ్మ తల్లి దయతో తప్పకుండా ఈ ఎన్నికల్లో సెంచరీ సీట్లు బీఆర్ఎస్ గెలుస్తుందన్నారు.

**మేనిఫెస్టోతో ప్రజల హృదయాలు ఉప్పొంగి పొతున్నాయి..**

సీఎం కేసీఆర్ మేనిఫెస్టో చూసి రాష్ట్రంలోని ప్రజల అందరి హృదయాలు ఉప్పొంగి పొతున్నాయన్నారు. కేసీఆర్ ఏ మాట ఇచ్చిన తప్పకుండా దానిని అమలు చేస్తాడనే నమ్మకం తెలంగాణ ప్రజల్లో ఉందన్నారు. హుస్నాబాద్ ప్రాంతం ఒక నాడు ఇది కరువు పీడిత ప్రాంతం, కల్లోలిత ప్రాంతం అని.. తెలంగాణ వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ నాయకత్వంతో హుస్నాబాద్‌లో ఎటుచూసినా పచ్చటి పొలాలతో బ్రహ్మాండంగా అభివృద్ధి చేసుకున్నామన్నారు. సీఎం కేసీఆర్ ప్రతి ఇంటికి నల్లా పెట్టి అక్కచెల్లెల మంచినీళ్ల గోస తీర్చిండన్నారు. తండాలను గ్రామ పంచాయతీలు కావాలని గత ప్రభుత్వాల హయాంలో ఎన్నో ఏండ్లు మొర పెట్టుకున్నా కాలేదన్నారు. సీఎం కేసీఆర్ తండాలను పంచాయతీలు చేసినట్లు తెలిపారు. వారి కలలను నిజం చేసిన నాయకుడు సీఎం కేసీఆర్ అన్నారు. తండాలకు నిధులు ఇచ్చి అద్భుతంగా అభివృద్ధి చేసుకుంటున్నట్లు చెప్పారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవడం జరిగిందన్నారు.

### వొడితెల కుటుంబమంటే.. సీఎం కేసీఆర్‌కు అమితమైన ప్రేమ

ఈ ప్రాంతం అన్నా, మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు, సతీశ్‌బాబు సీఎం కేసీఆర్‌కు అమితమైన ప్రేమ అని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఎప్పుడు వరంగల్ వెళ్లినా కెప్టెన్ సాబ్ ఇంటికే సీఎం కేసీఆర్ వెళ్తారని చెప్పారు. ఆ కుటుంబం ఆనాడు తెలంగాణ ఉద్యమ సమయంలో ఎంత సహకరించిందో మనందరికీ తెలిసిన విషయం అన్నారు. సతీశ్‌బాబు గురించి మీకు చెప్పాల్సిన అవసరం లేదు.. నాకంటే మీ అందరికీ ఎక్కువ తెలుసన్నారు. సతీశ్‌బాబు సౌమ్యుడు, ప్రజల మనిషి అని, ఆయన నిత్యం అందుబాటులో ఉండి మచ్చ లేని నాయకుడు అని చెప్పారు. మనమంతా ఇక్కడ సతీశ్‌బాబును, అక్కడ మన సీఎం కేసీఆర్‌ను హ్యాట్రిక్ అందించే విధంగా మీ అందరి తీర్పు ఉండాలని మంత్రి హరీశ్‌రావు ప్రజలను కోరారు.


సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న వొడితెల ఇంద్రనీల్ బాబు


ప్రజా ఆశీర్వాద సభ వేదికపై సీఎం కేసీఆర్‌తో మాట్లాడుతున్న వొడితెల సతీశ్

## హుస్నాబాద్ నుంచిశ్రీకారం చుట్టడం
# గొప్ప గౌరవం

- సతీశ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్

హుస్నాబాద్, అక్టోబర్ 15: వరుసుగా మూడు ఎన్నికల ప్రచారాన్ని సీఎం కేసీఆర్ హుస్నాబాద్ నుంచి శ్రీకారం చుట్టడం ఇక్కడి ప్రజలకు గొప్ప గౌరవంగా భావించాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. ఆదివారం హుస్నాబాద్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యాలయంలో అభ్యర్థులకు బీఫామ్‌లు అందజేసి ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించిన సీఎం కేసీఆర్ నేరుగా హుస్నాబాద్‌కు వచ్చారంటే ఇక్కడి ప్రజలపై ఆయనకు ఉన్న నమ్మకం, గౌరవానికి నిదర్శనమన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి కొనసాగాలంటే, అనుకున్న సమయంలో గౌరవెల్లి రిజర్వాయర్ నీళ్లు పొలాలకు రావాలంటే మూడోసారి వొడితెల సతీశ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అభివృద్ధిని కొనసాగించాలంటే బీఆర్ఎస్‌ను మూడోసారి గెలిపించాలన్నారు. సమావేశంలో కేశవరావు, కెప్టెన్ లక్ష్మీకాంతరావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, పాతూరి సుధాకర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్లు వేలేటి రోజాశర్మ, డాక్టర్ సుధీర్‌కుమార్, సిద్దిపేట జడ్పీ వైస్‌చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కర్ర శ్రీహరి, పేర్యాల రవీందర్‌రావు, భూపతిరెడ్డి, హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న, వైస్ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎంపీపీలు లకావత్ మానస, మాలోత్ లక్ష్మి, కొక్కుల కీర్తి, కొత్త వినీత, ప్రభాకర్‌రెడ్డి, అనిత, జడ్పీటీసీలు భూక్యా మంగ, నాగరాజు శ్యామల, గీకురు రవీందర్, వంగ రవీందర్, గోపాల్‌రావు, మార్కెట్ చైర్‌పర్సన్ ఎడబోయిన రజనీతిరుపతిరెడ్డి, ఎన్ఎల్‌సీఎఫ్ డైరెక్టర్ రాజ్యలక్ష్మి, మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## స్వరాష్ట్రంలో హుస్నాబాద్ సస్యశ్యామలం

- మూడోసారి ముఖ్యమంత్రిగా సీఎం కేసీఆర్‌ను హుస్నాబాద్ ప్రజలు ఆశీర్వదించాలి
- హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

2014కు ముందు నిత్యం కరువు కాటకాలతో కల్లోలిత ప్రాంతంగా ఉన్న హుస్నాబాద్ నియోజకవర్గం సీఎం కేసీఆర్ కృషితో సస్యశ్యామలంగా మారిందని ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. ఆయన చలవతోనే పూర్తయిన గౌరవెల్లి రిజర్వాయర్ నీళ్లు ప్రతి ఎకరాకు అందితే ఈ ప్రాంతం కోనసీమను తలపిస్తుందన్నారు. సీఎం కేసీఆర్‌కు లక్ష్మి నియోజకవర్గంగా ఉన్న హుస్నాబాద్ నియోజకవర్గం రూ.9వేల కోట్లతో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. హుస్నాబాద్‌కు ఏది అడిగినా కాదనకుండా ఇచ్చిన గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్ మాత్రమేనన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక మిడ్‌మానేరు–తోటపల్లి, దేవాదుల, కాకతీయ కాల్వ ద్వారా నియోజకవర్గంలో 60వేల ఎకరాలకు సాగునీరందుతోందని, దీంతో నియోజకవర్గంలోని చిగురుమామిడి, సైదాపూర్, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లో పుష్కలంగా పంటలు పండుతున్నాయని చెప్పారు. ప్రతి గ్రామంలో కనీసం రూ.60లక్షల అభివృద్ధి పనులు జరిగినట్లు తెలిపారు. గిరిజన తండాల రోడ్లకు రూ.61కోట్లు వెచ్చించామంటే ఎంత అభివృద్ధి జరిగిందో అర్థమవుతున్నదన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు నిర్వాసితులను రెచ్చగొట్టి కేసులు వేయకుంటే గౌరవెల్లి రిజర్వాయర్‌ను ఇప్పటికే సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించుకునే వాళ్లమని, ఆ రెండు పార్టీల నాయకులకు ఈ ప్రాంతానికి గోదావరి నీళ్లు రావడం ఇష్టం లేదని విమర్శించారు. వారికి ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. మూడోసారి సీఎంగా కేసీఆర్‌ను, ఎమ్మెల్యేగా తనను ఆశీర్వదించాలని కోరారు.



### సీఎంకేసీఆర్ బహిరంగ సభ విశేషాలు

హుస్నాబాద్ టౌన్, అక్టోబర్ 15 : సీఎం కేసీఆర్ అసెంబ్లీ ఎన్నికల మూడో జైత్రయాత్ర హుస్నాబాద్ నుంచి ఆదివారం ప్రారంభమైంది. సెంటిమెంట్‌గా భావిస్తున్న హుస్నాబాద్‌లోని కరీంనగర్ రోడ్డులో అసెంబ్లీ ఎన్నికల శంఖారావం ప్రారంభించారు. బహిరంగ సభకు మంత్రి తన్నీరు హరీశ్‌రావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, రాజ్యసభ సభ్యుడు, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.కేశవరావు, మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు, సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, హనుమకొండ జిల్లా పరిషత్ చైర్మన్ సుధీర్‌కుమార్, ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డితోపాటు బీఆర్ఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

**బహిరంగసభ విశేషాలు...**

- 2:30 నిమిషాల నుంచి బీఆర్ఎస్ బహిరంగ సభా స్థలికి ప్రజలు చేరుకోవడం మొదలు పెట్టారు.
- 3:00 గంటల వరకు బహిరంగ సభాస్థలిలో సగం కంటే ఎక్కువగా జనంతో నిండిపోయింది.
- 3:53 నిమిషాలకు సీఎం కేసీఆర్ సభాస్థలికి వస్తున్నారంటూ ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ ప్రకటించారు.
- 4:00 నిమిషాలకు కళాకారుడు ఏపూరి సోమన్న ఆధ్వర్యంలో కళాకారుల పాటలు ప్రారంభం.
- 4:00 గంటల వరకు బీఆర్ఎస్ బహిరంగ సభా స్థలం నిండి రహదారులపై సీఎం రాకకోసం ప్రజల ఎదురుచూపు.
- 4:35 నిమిషాలకు సీఎం కేసీఆర్ హెలిక్యాప్టర్ బహిరంగ సభా స్థలిలోని హెలిప్యాడ్‌కు చేరుకుంది.
- 4:42 నిమిషాలకు ప్రత్యేక వాహనంలో హెలిప్యాడ్ నుంచి సీఎం కేసీఆర్ సభాస్థలికి బయలుదేరారు.
- 4:44 నిమిషాలకు బహిరంగ సభ వేదికపై నుంచి ప్రజలకు అభివాదం తెలిపిన సీఎం కేసీఆర్
- 4:44 నిమిషాల నుంచి 4:51 నిమిషాల వరకు బహిరంగ సభ వేదికపై నుంచి హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ ప్రసంగం
- 4:51 నిమిషాల నుంచి 4:53 నిమిషాల వరకు బహిరంగ సభలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రసంగం
- 4:54 నిమిషాలకు బహిరంగ సభలో మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రసంగం దాదాపు ఐదు నిమిషాల పాటు సాగింది.
- 5:00 గంటలకు సీఎం కేసీఆర్ ప్రసంగం ప్రారంభం
- 5:21 నిమిషాలకు సీఎం కేసీఆర్ ప్రసంగం ముగించి ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌కు బీఫామ్ అందజేశారు.
- 5:24 నిమిషాలకు బహిరంగ సభ వేదిక నుంచి ప్రత్యేక వాహనంలో హెలిప్యాడ్‌కు బయలుదేరారు.
- 5:31నిమిషాలకు సీఎం కేసీఆర్ ప్రయాణించే హెలిక్యాప్టర్ హైదరాబాద్‌కు బయలుదేరింది.